**తెల్లారి నాలుగంటలకల్లా తెలివొచ్చేసింది అలక్కి అస్లు అలక నిద్రపోతేగా... రాత్రంతా ఏవేవో రంగు రంగుల కలలతో ఆమెకి నిద్రేపట్టలేదు. మూడు గంటలకి ఏదో మాగన్నుగా నిద్రలోకి జారింది అంతే—నాలుగయ్యేసరికి కళ్ళు పత్తికాయల్లా తెరుచుకున్నాయ్.**

శీతాకాలం కావటంవల్ల ఇంకా కటిక చీకటిగా ఉంది. పైగా చలి దంచేస్తున్నది. అయినా అలక్కి పడుకోవాలనిపించలేదు. ఆమె మనసు దూది పింజలా తేలిపోతుంది. ఇంత ఆనందానికి కారణం.. రెండ్రోజుల క్రితం జరిగినదంతా సినిమా రీళ్ళగా కళ్ళ ముందు కదిలింది...

"ఏవండీ చివరిసారిగా అడుగుతున్నా పెట్టిస్తారా లేదా?" భారమైన గుండెతో అడిగింది అలక.

"కుదర్దు"! బుర్ర అడ్డంగా ఉపాడు. చెకుముకి రావు.

బుర్రమీద ఫెడేల్మని ఒక్కటివ్వాలనిపించింది అలక్కి అయినా ఆపుకుని—" అన్నాను చెకుముకిరావు ఈసారి బుర్రని మరంత అడ్డదిడ్డంగా ఊపుతూ

"అయితే నేను ఉరేసుకు ఛస్తా"!

"నీ ఇష్టం ఏదోఒకటి చెయ్..వంటైపోయిందిగా"

అలక పమిట కొంగు నోట్లో కుక్కుకుంటూ వలవలా ఏడుస్తూ లోపలికి పరిగెట్టింది. గబగబా ఓ స్టూలు ఫేనుకింద వేసింది. తటాలున తను కట్టుకున్న చీర విప్పేసి ఫేనుకి ఉరి తాడుగా ముడేసింది. అంతలోనే కంగారుగా వాష్ బేసిన్ దగ్గరికి పరిగెట్టి భళ్ళున 'వాంతి' చేసుకుంది. అప్పుడే లోపలికొచ్చిన చెకుముకి రావు ఖంగుతున్నాడు.. జుత్తు పీక్కుంటూ...

"వీల్లేదు... వీల్లేదంతే..." అంటూ అరిచాడు.

అలక కోపంగా చూసింది...ఎందుకు వీల్లేదూ వీలుంది అంతే" అంది. "మరి మరి నేను ఫామ్లీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నాగా—ఏలా వీలౌతుంది"?అన్నాడు గుడ్లు తేలేస్తూ—

"ఏమిటి మీరనేది"? అలక మొహం చిట్లిస్తూ అడిగింది.

"అదే... నీకి వేవిళ్లు..."

"మీ తలకాయ... ఇందాక మీ వల్నేగా వెధవ పమిట కొంగంతా నోట్లో కుక్కుకున్నా... అది గొంతువరకూ పోయి డోకొచ్చింది"!

"అంతేనా!" అన్నాడు చెకుముకి రావు సంతోషంగా.

"అంతకన్నా ఏం వుండి చస్తుందీ..ఇక పక్కకి జరగండి నే వెళ్ళాలి". అంది కోపంగా

"అప్పుడే రాత్రయిందా..."? అన్నాడు చుకుముకిరావు అలకని మురిపెంగా చూస్తూ...

"లేదే ఏం?"'అంది అలక.

"చీరాగీరా విప్పేస్తేనూ" కన్ను గీటాడు చెకుముకిరావు.

"నా పిండాకూడు... తాడు ఎక్కడా దొరక్క నిక్షేపంలాంటి నా చీర తోనే ఉరేసుకోవలసి వచ్చింది.. నేను త్వరగా చావాలి.. నస ఆపండిక..." అలక వేగంగా స్టూలు మీదికి ఎక్కింది. చెకుముకిరావు చప్పున అలక చెయ్యి పట్టి ఆపాడు.

"నన్నాపకండిక! అలక గంజుకుంది.

"సరే! పెట్టిస్తాగానీ ఈ ప్రయత్నం మానుకో" అన్నాడు ఆవదం తాగిన మొహంతో.

"నిజంగానా! అంది అలక నమ్మలేనట్టు. "నీ మీదొట్టు... లోకపోతే నామీదొట్టు సరేనా"! అన్నాడు.

"అయితే రేపే వెళ్ళి ఆ 'డిష్ యాంటీనా' వాళ్ళతో మాట్లాడుతారుగా" అంది అలక సంతోషంగా చీర కట్టుకుంటూ.

"అలాగే అలాగే!" అన్నాడు చెకుముకి రావు నీర్సంగా. ఆ విధంగా అలక ఆర్నెల్లుగా బ్రతిమాలి, బామాలి, అలిగి అరిచి గీపెట్టి ఆఖరికి ఆత్మహత్యా ప్రయత్నంతో తన చిరకాల వాంఛ అయిన టీవీకి ఉపగ్రహం ఛానల్ పెట్టించుకోనే శుభ ముహూర్తం రానే వచ్చింది. ఆ ముందు రోజు రాత్రే వాళ్ళ టీవీకి 'డిష్ యాంటీనా' ఏర్పాటు చెయ్యడం జరిగిపోయింది.

మంచి ముహూర్తంగా ఎంచి మర్నాడు ఆదివారం ఎనిమిదింటికి టీవీ ప్రోగాంస్ చూట్టం ప్రారంభించాలని అలకే నిర్ణయించింది.

ఆ రోజే ఆదివారం అలక ఆనందంలో తేలిపోవటానికి అదే కారణం... గడియారం ఏడు గంటలు కొట్టిది. అలక ఆలోచనల్లోంచి తేరుకుని ఉలిక్కిపడింది.

"అయ్యాయ్యో... ఈ సరికి పన్లన్నీ కానిచ్చి టీవీ ముందర అందరం కూర్చునే ఏర్పాట్లు చేద్దాం అనుకున్నాను...ప్చ్... అలక రివ్వున బాత్రూంలోకి పరిగెట్టి బకెట్టుడు చన్నీళ్ళు తెచ్చి చెకుముకిరావు మీద గుమ్మరించింది. 'నీ మొహం మండ,,, ఇదేం లేపడమే...రోజూ బాగానే లేపేదానివిగా ఈవేళేమయిందీ...? అన్నాడు చెకుముకి రావు లేచి బట్టలు పిండుకుంటూ.

"సర్లెండి ఈ వాళ తీరుబడిగా మిమ్మల్ని పది సార్లు లేపడానికి టైమెక్కడిదీ.. అవతల టీవీ ప్రోంగ్రాంస్ వచ్చేస్తాయ్" అంటూ అతన్ని బాత్రూంలోకి తోసింది. చెకుముకి రావు స్నానం పానం పూర్తయి వచ్చేసరికి— బుజ్జిగాణ్ణీ, చంటిదాన్ని చెవి మెలేసి మరీ లేపి కూచోబెట్టింది. ఆ తరువాత వాళ్లకి స్నానాలూ గట్రా పూర్తి చేసి బట్టలు తొడిగి అందర్ని టీవీ ముందర స్నానం ముగించి తయ్యారయి టీవీ ముందుకొచ్చి కూచుంది. ఇంతలో—

చెకుముకిరావు కెవ్వుకెవ్వున అరుస్తూ మెలికలు తిరగసాగాడు

"ఏమయిందీ?" అంది అలక గాభరాగా.

"కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయ్" అన్నాడు లుంగచుట్టుకుపోతూ. " నా మతి మండా" తల బాదుకుని అలక వీధిలోకి పరిగెట్టి పాలవాడు పెట్టిపోయిన పాల పాకెట్స్ తీసుకుని వంట గదిలోకి దూరింది. గబగబా 'టీ' చేసి పిల్లలకి పాలు కలపి టీవీ గదిలోకి తెచ్చింది.

"థూ" పాలల్లో పొడికలపలేదు "పిల్లలు ఊసేసారు. "టీ"లో చక్కెర మర్చిపోయావే" అన్నాడు చెకుముకిరావు వికారంగా ముఖంపెట్టి. అలక వంటగదిలోకి పరిగెట్టి పంచదారా, పొడీ తెచ్చింది. ఈలోగా టీవీ ప్రోగ్రాంస్ ప్రారంభం అయిపోయాయి.

"చెంచా ఏదీ" —అన్నాడు చెకుముకిరావు.

అలక మళ్ళీ లోపలికి పరిగెట్టుకెళ్ళి చెంచా తెచ్చి కలిపింది.

టీవీ ప్రోగ్రాంస్ భలే రంజుగా జరుగుతున్నాయ్. ఇంతలో కాలింగ్ బెల్లు మోగింది. అలక వెళ్ళి తలుపు తీసింది. పని మనిషి లచ్చి వచ్చింది.

"టీవీ కనెచ్చన్ పెట్టించినారేంటమ్మా !"అంది కళ్ళెగరేస్తూ.

"అవునే నువ్వూ కూచో ... కాసేపు అయ్యాక పనిచేద్దూగాని" అంది అలక ఆనందంగా

"నాను సూడను బాబూ —ఇప్పుడు పన్జేస్తున్న అందరిళ్ళల్లో రోజు సూసి సూసి బోరెక్కిపోయా —నాకు అంట్లు ఏసేయ్యండి" అంది అలక్కి లేవక తప్పలేదు.

అరగంట అయింది. పనిమనిషి వెళ్ళాక తలుపు గెడేసి సోఫాలో కూలబడింది అలక.

మళ్ళీ బెల్లు మోగింది. ఈ సారి పక్కింటి పర్వతాలు .. పావుశేరు కందిపప్పు బదులుకు వచ్చింది.

ఎప్పుడూ ఏది బదులడిగినానవ్వుతూ ఇచ్చే అలక ఆవేళ రుసరుసలాడుతూ ఇచ్చింది. టీవీ ముందునుండి లేచి. ప్చ్ .. అంతా టీవీ మహాత్యం అనుకుంటూ బయటకి నడిచింది పర్వతాలు.

టీవీ ప్రోగ్రాంస్లో అందరూ మునిగిపోయారు. టైము రెండున్నర 'కెవ్వ్' మంటూ మళ్ళీ చెకుముకిరావు లుంగచుట్టుకుపోసాగాడు ....


'ఆకలీ' అంటూ పిల్లల గోల ప్రారంభం ... "ఇదిగో ... ఇప్పుడే వడ్డించేస్తా" .. అంటూ అలక పెద్ద పెద్ద అంగలతో వంటగదిలోకి వెళ్ళింది...

అంతే మరుక్షణం అలక గావుకేకతో పాటు 'ఢాం' అన్న శబ్దం వినబడింది.

చెకుముకిరావుకంగారుగా వంటగదిలోకి పరిగెట్టాడు. "వేడివేడి కూరదాకో —అన్నంగిన్నో పట్టు

# ఇంటి(వీ) గోల

-రాగతి పండరి



కున్నావా ... ఏ మసిగుడ్డతోనో పట్టుకోవచ్చుగా ..." ! అన్నాడు క్రింద కూలబడి వున్న అలకని చూస్తూ ...

నా శ్రాద్ధం ! అంతోటి అదృష్టమా .. ఇంకా వంటే చెయ్యలేదు.. చేసేసా అనుకున్నా ప్చ్...." అంటూ కత్తిపీట ముందేసుకు కూచుంది అలక.

చెకుముకిరావు కాళ్ళు ఈడ్చుకుంటూ కడుపు చేత్తో పట్టుకుని టీవీముందుకూలబడ్డాడు.

ఆకలి హాహాకారాల మధ్య అలక ఎలాగో ఉడకని అన్నం, మరగని చారూ, మాడిన కూరాతయారు చేసింది. అందరి భోజనాలూ అయ్యేసరికి సాయంత్రం అయింది —అలక టీవి గదిలోకి మోసుకొచ్చిన గిన్నెలన్నీ వంటగదిలో సర్ది చక్క బెట్టి —ఉస్సూరంటూ టీవీ ముందు కూలబడింది.

ఇంతలో —'పర పర' నములుతున్న బుజ్జిగాణ్ణి "వెధవా .. బియ్యం తింటున్నావెందుకూ .. జబ్బు చేస్తుంది తెలుసా" .. అంటూకసిరాడు చెకుముకిరావు. "అసలు బియ్యం ఎక్కణ్ణించి తెచ్చుకు తింటున్నావురా .. ! అలక కోప్పడింది.

"మీ బొంద .. ఇవి బియ్యం కావు .. ఇందాక అన్నమే కాసిన్ని నా జేబులో వేసుకు నములుతున్నా" ! చిరాగ్గా చెప్పాడు బుజ్జిగాడు. బిత్తర పోయాడు చెకుముకిరావు. తెల్లముఖం వేసింది అలక. సినిమా పూర్తయి మళ్ళీ వెరైటీ ప్రోగ్రాంస్ ప్రారంభం అయ్యాయి టీవీలో.

రాత్రి పదయింది. చెకుముకిరావు ఓ గంట అలా బైట తిరిగి వచ్చాడు.

రకరకాల ప్రోగ్రాంస్‌తో టీవీ అదిరిపోతోంది. పిల్లలూ టీవీ చూస్తూ మధ్య మధ్య ఆడుకొని కొట్టుకుని అక్కడే పడి నిద్రపోయారు.

అలక ఓపిగ్గా కళ్ళు విప్పార్చుకుని టీవి చూస్తున్నది.

"ఇంకా టీవీ ముందు నుండి లేచి మా ముకాన కాస్త పిండాకూడు తగలెయ్యి" అన్నాడు చిరాగ్గా

"నాకోపిక లేదు... అన్నం వండాగానీ మీరే ఆగిన్నెలన్నీ ఇక్కడికి చేరెయ్యండి !" అంది అలక పిల్లల్ని లేపుతూ, "వెధవ యాంటీనా పెట్టినరోజే ఇలావుంటే ముందుకు ముందు నా పాట్లు ఎలా ఉంటాయో..." దీర్ఘంగానిట్టూరుస్తూ వంట గదిలోకి వెళ్ళాడు చెకుముకిరావు.

అందరూ ఎలాగోలా భోజనాలు కానిచ్చారు.

పిల్లలు నిద్రమానేసి టీవీ చూట్టం ప్రారంభించారు.

అర్ధరాత్రి సినిమా మొదలైంది. అందరూ సినిమా చూస్తూ అక్కడే పడి నిద్రపోయారు.

భళ్ళున తెల్లారిపోయింది. ఎక్కడ పని అక్కడే వుంది. చెకుముకిరావుకి ఆఫీసుకు లేటయిపోయింది. వంట కాలేదు. టిఫెన్ కుదర్లేదు. 'ఉస్సూరు' అంటూ ఆఫీసుకు పోయాడు పాపం. పిల్లలకి స్కూలు బస్సు తప్పిపోయింది. ఆటోలో అలక పిల్లల్ని స్కూల్లో దింపవలసి వచ్చింది. వాళ్ళకి పాలు కలిపి ఇవ్వటం మర్చిపోయింది.

ఇంటికి వచ్చిన పిల్లలు పుస్తకాలు తెరవటంలేదు. హోంవర్కు చెయ్యటంలేదు. టీవీ చూస్తూ అక్కడే పడి నిద్రపోతున్నారు. చెకుముకిరావుకి రోజూ ఆఫీసుకు లేటయిపోయి ఆఫీసర్‌చేత చీవాట్లు తినవల్సి వస్తున్నది. ఇక అలక పరిస్థితి మరీ దారుణంగా వుంది. నిద్రచాలక కళ్ళులోతుకుపోయి ఎర్రగా తయారయ్యాయి. వంట గది లోంచి టివి గదిలోకి పదిసార్లు తిరిగి తిరిగి కాళ్ళు పీకులు మొదలయ్యాయి. నీర్సం ముంచుకొస్తున్నది, ఇంటికొచ్చిన చుట్టాలతోనైనా మాట్లాడటానికి కుదరటంలేదు.లేకపోతే ఏదీ లేదు —ఉంటే చూపబుద్ధి అవుతుంది.

ఇలా వారంరోజులు గడిచాయ్.

ఆరోజు చెకుముకిరావు ఆఫీసు నుండి వచ్చేసరికి ఇల్లంతా ప్రశాంతంగా వుంది. టీవీ మోగటం లేదు. పిల్లలు చదువుకుంటున్నారు. అలక వంట ప్రయత్నంలో వుంది.

"టీవీ పాడయిందా ?" అన్నాడు ఆశ్చర్యంగా చెకుముకిరావు. "లేదు నిక్షేపంగావుంది !" అంది అలక వంట గదిలోంచి మంచినీళ్ళ గ్లాసుతో వస్తూ "మరి పెట్టుకోలేదేం ?" తెల్లబోతూ అడిగాడు. "ఏవండీ .. నా కోరిక ఒకటి మీరు తీర్చాలి ..." అంది —మంచినీళ్ళ గ్లాసు అతని చేతికందిస్తూ, "ఇంకా ఏవన్నా కనెక్షన్లు పెట్టించాలా ?" అన్నాడు వెర్రిమొహం పెట్టి.

"కాదులెండి ... పెట్టింది తీయించెయ్యాలి అంతే అంది నిస్సత్తువుగా సోఫాలో కూలబడుతూ అలక.

"ఆ..." అని అబ్బురపడిపోతూ —చేతిలో మంచినీళ్ళు గటగటా తాగేసాడు చెకుముకిరావు.

★